క్లుప్తంగా

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట


దుర్గమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బూర్జ: మండల కేంద్రంలోని పండా వీధి సమీపంలో గల నాగావళి నదీతీరంలో గ్రామదేవత దుర్గమ్మ తల్లి విగ్రహం, పురాతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని బూర్జ గ్రామ వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా చేపట్టారు. దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టను కింతలి సీతారామ స్వామి, విజయకుమారి దంపతుల ఆర్థికసాయంతో నిర్వహించారు. గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


కొల్లివలసలో ఎరువులను తూకం వేస్తున్న అధికారులు

బూర్జ: ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం ఏడీఏ కొత్తూరు డివిజన్ స్క్వాడ్ బగ్గు రజని అన్నారు. మండలంలోని కొల్లివలస, బూర్జ గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగు మందులు షాపులను శనివారం స్థానిక వ్యవసాయ శాఖాధికారి వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్టాక్, బిల్లు బుక్, బ్యాచ్, తూకవలు, ధరల పట్టిక పరిశీలించారు. ధర, తూకంలో వ్యత్యాసం తేడాలేకుండా విక్రయించాలన్నారు. రైతులు నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. కొత్తూరు డివిజన్ ఏడీఏ బి.రాజగోపాలరావు పాల్గొన్నారు.

ఇన్వర్టర్, కుర్చీల వితరణ


వితరణ చేసిన ఇన్వర్టర్‌ను ప్రారంభిస్తున్న కృష్ణబాబు

నరసన్నపేట: నరసన్నపేట పరిధి రాజీవ్‌నగర్ కాలనీలో ఇటీవల ప్రతిష్ఠించిన రామాలయానికి భవానీపురానికి చెందిన నేతింటి ఎండువాడు ఇన్వర్టర్, కుర్చీలు వితరణ చేశారు. వీటి విలువ రూ.21 వేలు ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధి పతివాడ గిరీశ్వరరావు తెలిపారు. శనివారం ఇన్వర్టర్ ఆలయానికి అప్పగించగా ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు ప్రారంభించారు. ఆలయ అర్చకులు వనమాలి బాలకృష్ణ శర్మ, బమిడిపాటి జగన్నాథరావు, జవ్వాది రాజేష్ పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకంతో ఆదాయం


మొక్కల పంపిణీ చేస్తున్న రామశంకర్

ఎల్.ఎన్.పేట: పండ్ల మొక్కల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని హెర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గురుగుబెల్లి రామశంకర్ అన్నారు. మండలంలోని మల్లికార్జునపురం గ్రామంలో శనివారం పలువురి రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. రైతులు పొలం గట్లపైన, వారికి ఉన్న పెరటి స్థలం, ఇతర ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలు పెంచడం వల్ల ఆయా సీజన్లలో పంట దిగుబడులు వస్తామన్నారు. పలువురి రైతులకు మోడల్ హార్టికల్చర్ ప్లాంటేషన్ ద్వారా సపోటా, మామిడి, జామ వంటి మొక్కలు పంపిణీ చేశారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


రికార్డులు పరిశీలిస్తున్న నోడల్ అధికారి లక్ష్మీతులసి

జలుమూరు: కౌమార దశ బాలికల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి లక్ష్మీతులసి అన్నారు. శనివారం తిలారు రైల్వే స్టేషన్ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. రక్త పూత నమూనాలు సేకరణ ద్వార రక్తహీనత గుర్తించి తగిన మందులు అందజేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలని, పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ, పారా మెడికల్ అధికారి వాన సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


రామకృష్ణాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

జలుమూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అంధవరం పంచాయతీ పరిధి ఉప్పరపేట, అంధవరం, గొల్లపేట, రామకృష్ణాపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌ను దీవించాలని కోరారు. గ్రామంలో తాగునీరు, కాలవలు నిర్మించాలని ఎమ్మెల్యేను సర్పంచ్ సుధారాణి, ఎంపీటీసీ శంకుతల కోరారు. గడపగడపకు నిధులతో ఈ పనులు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జగనన్న ఇళ్లు మంజూరు చేయాలని రాములమ్మ, నూలు ముఖలింగం కోరారు. ఇళ్లకు అవసరమైన స్థలాన్ని స్వగ్రామంలో కేటాయించాలని తహసీల్దార్ సత్యంను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఎమ్మెల్యేకు దీవెనెలు..

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించే క్రమంలో రామకృష్ణాపురం, గొల్లపేట గ్రామాలలో వృద్ధులైన సబ్బి లచ్చమ్మ, రేగాన మల్లమ్మ, పిట్ట లచ్చమ్మ తదితరులు ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. సీఎం జగన్ మాకు ప్రతీ నెల ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రేగాన శ్యామ్, తవిటినాయుడు, ఆదిబాబు, నడుపూరి గోవిందరావు, పిట్ట ప్రసాద్, కొండయ్య, సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు శ్యామలరావు, రాజప్పల నాయుడు, వెలమల అసిరినాయుడు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

పాతపట్నం: మహిళా సంఘాలకు చెందిన ప్రతి మహిళా ఆర్థికంగా స్థిరపడాలని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలో వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం మహిళా సంఘాల సభ్యులు, వైకేపీ సిబ్బందితో సమావేశమయ్యారు. మహిళా సంఘాలకు బ్యాంకుల నుంచి ఇస్తున్న అన్ని రకాల రుణాలు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ప్రతినెలా ఆదాయం వచ్చేలా పెట్టుబడి పెట్టి వ్యాపారాలు అభివృద్ధి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు పరిశీలించారు. వీఓఎస్‌ల సమావేశంలో రోజువారీ నివేదికలు, కమ్యూనిటీ ఆడిట్ మానిటరింగ్ రిపోర్టు, సభ్యుల బయోమెట్రిక్ నివేదిక, వీఓ గ్రేడింగ్, బ్యాంక్ లింకేజీలు, రికవరీలు, జగనన్న తోడు ఉన్నతి, అంతర్గత రుణాల కోసం అడిగి తెలుసుకున్నారు. డీపీఎం డి.నారాయణరావు, నాగలక్ష్మి, కె.మోహనరావు, ఏపీడీ ఆర్.వి.రమణ, ఏసీ సుబ్రహ్మణ్యం, బీఎల్‌ఏపీఎం సుశీల, ఏపీఎం పి.మనోరత్నం, త్రినాథమ్మ, లలిత, శ్రీరామచంద్ర మూర్తి, జి.ప్రసాద్, సీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఎంఈఓలు

హిరమండలం: మండలంలోని తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పది మంది పేద విద్యార్థులకు బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ సంస్థ మేనేజర్ రెడ్డి రాంబాబు ఒక్కో విద్యార్థికి రూ.2500 చొప్పున ఆర్థిక సహాయాన్ని ఎంఈఓలు కె.రంబాబు, టి.షన్ముఖరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ, పీఎంసీ చైర్మన్ ఎం.కేశవరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

రాజుల చెరువు పరిశీలన


రాజుల చెరువు గట్టుపై ఉన్న నిర్మాణాలను పరిశీలిస్తున్న గరీబ్ గైడ్ సభ్యులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేట నడిబొడ్డున ఉన్న రాజుల చెరువును పూర్వ స్థితికి తీసుకురావాల్సిన అవసరం ఉందని గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అన్నారు. రాజుల చెరువును బృందం సభ్యులు డీవీ రావు, మల్లిబాబు, వి.రాఘవేంద్రరావు, ఎ.శ్రీనివాస్, ఆర్‌హెచ్ రావు శనివారం పరిశీలించారు. ఈ చెరువు ఆక్రమణలకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో విచారణ చివరి దశకు చేరిందన్నారు. ఈ నేపథ్యంలో పిటీషనర్ విజ్ఞప్తి మేరకు సుప్రీంకోర్టు న్యాయవాది డీవీ రావు అధ్యక్షతన గరీబ్ గైడ్ నుంచి ఐదుగురు సభ్యులను నియమించిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చెరువును పరిశీలించినట్లు డీవీ రావు తెలిపారు.

మైక్‌సెట్ అందజేత

హిరమండలం: మండలంలోని ధనుపురం ప్రాథమిక పాఠశాలకు స్థానిక సర్పంచ్ దారపు ఢిల్లీశ్వర రావు, రెడ్డి జగదీశ్వరరావులు ఆంప్లిఫైర్, వైరలస్ మైక్‌ను ఎంఈఓలు కె.రాంబాబు, షన్ముఖరావు సమక్షంలో హెచ్‌ఎం కె.చంద్రరావుకు శనివారం అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన మామిడి భగవాన్ ఆయన సోదరుడు మురళి జ్ఞాపకార్థం రెండు గోడ గడియారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


నరసన్నపేట: కోటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన ఎంపీపీ ఆరంగి మురళి సోదరుడు కోటేశ్వరరావు పెద్ద కుమార్తె ఇటీవల మృతి చెందారు. కోటేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ధర్మాన రామదాసు శనివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య కూడా పరామర్శించారు. పార్టీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, ధర్మాన జగన్, తంగుడు గిరి ఉన్నారు.

సారవకోట: మండలంలోని ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య శనివారం పరామర్శించారు. వెంకటాపురం, కిన్నెరవాడ, అలుదు, చీడిపూడి, బుడితి తదితర గ్రామాల్లోని మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, పంచిరెడ్డి సూర్యనారాయణ, నిక్కు కృష్ణారావు, నక్క తులసీదాస్, నిక్కు రాజశేఖర్, పారశెల్లి తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పన

- సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్, రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్


లింగాలవలసలో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న కమిషనర్ సిద్ధార్థ జైన్, ఎమ్మెల్యే కృష్ణదాస్

జలుమూరు: జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర పూర్తిస్థాయి వసతులు కల్పించాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్ అన్నారు. ఈ నెల 30న జగనన్న కాలనీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో లింగాలవలస, చల్లవానిపేట నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి శనివారం సందర్శించారు. దీనిపై సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కాలనీకి అందించే తాగునీరు ఎక్కడ నుంచి తెస్తున్నారు? ఫిల్టర్ చేస్తున్నారని అడి తెలుసుకున్నారు. విద్యుత్ మీటర్లు అమర్చారా? ఎమైనా డబ్బులు వసూలు చేశారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఎన్ని ఇళ్లు ఇక్కడ నిర్మాణం చేస్తున్నారు? ఇళ్ల కోసం ఎమైనా డబ్బులు చెల్లించారా అని లబ్ధిదారుల వద్ద ఆరా తీయగా.. ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వలేదని, ఏ నాయకుడూ అడగలేదన్నారు. దీంతో కమిషనర్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానంగా కాలనీల సింహద్వారం పనులు వెంటనే పూర్తిచేయాలని గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు.

చెత్త సంపద కేంద్రాన్ని తరలించాలి..

జగనన్న కాలనీ ప్రవేశ ద్వారంలో ఉనన్న చెత్త నుంచి సంపద కేంద్రం వల్ల దుర్వాసన వస్తోందని, దీని వల్ల కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని కమీషనర్ దృష్టికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తీసుకెళ్లారు. వేరేచోట స్థలం కేటాయించి అక్కడ ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై కమిషనర్ స్పందించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సత్యంను ఆదేశించారు. అనంతరం కరవంజ రైతు భరోసా కేంద్రం, సచివాలయాన్ని పరిశీలించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. వరి అనంతరం ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని వ్యవసాయ అధికారి సురేష్‌కు సూచించారు. భూ సర్వేకు సంబంధించిన డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. వాణిజ్య పంటలపై రైతులతో ముచ్చటించారు. సచివాలయం ద్వారా అందుతున్న సేవలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ కలక్టర్ రాఘువేంద్ర మీనా, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, తహసీల్దార్ సత్యం, ఎంపీపీ వాన గోపి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు నరసన్నపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధి పురుషోత్తంనగర్ కాలనీ, రాజీవ్‌నగర్‌తోపాటు పరిసర వీధుల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ బూరల్లి శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారంతో మేజరు పంచాయతీ నరసన్నపేటలో ఈ కార్యక్రమం పూర్తవుతుందన్నారు. అలాగే మండలంలో 17 సచివాలయాల్లో ఈ కార్యక్రమం పూర్తి కానుందన్నారు. ఉదయం 7.30 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. అధికారులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదుతో మేలు


కరకవలస వద్ద ఈ-క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పక్కాగా జరగాలని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ అన్నారు. కరకవలస రైతు భరోసా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. రైతులతో కలిసి పంట పొలానికి వెళ్లి ప్రస్తుతం సాగు చేస్తున్న పంట వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా రైతును పంట పొలం వద్ద ఫొటో తీయాలని సూచించారు. ఇలా చేయటం వల్ల రైతులు పంట విక్రయించే సమయంలో అనుమతులు ఇచ్చేందుకు, పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి పరహారం, రాయితీలు, బీమా చెల్లించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. పంట నమోదు వేగవంతం చేయాలని గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులకు సూచించారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

సారవకోట: మండలంలోని బుడితి గ్రామం కొసన్నపేట వీధిలో మురుగునీటి సమస్య పరిష్కరించాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్యను స్థానికులు కోరారు. గ్రామానికి వెళ్లిన ఆయన దృష్టికి వీధిలో ఉన్న సమస్యలు వివరించారు. మురుగు, చెత్త పేరుకుపోయిందని, వర్షం పడితే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే సచివాలయ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క తులసీదాస్, నిక్కు కృష్ణారావు, బోర శ్రీరామమూర్తి, నిక్కు రాజశేఖర్, రామకృష్ణ, ఆదినారాయణ, జాడ కార్తీక్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక అలంకరణ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణి అమ్మవారి ఆలయంలో శనివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు.

పెద్దపులి సంచారంపై అప్రమత్తం


గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సెక్షన్ అధికారి ధర్మారావు

ఎల్.ఎన్.పేట: మండలం పరిధిలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నందును ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సెక్షన్ అధికారి ఎల్.ధర్మారావు అన్నారు. మండలంలోని మురగడలోవ, జంబాడ గ్రామాల్లో శనివారం గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ ప్రాంతంలోని అడవుల్లో పెద్దపులి సంచరిస్తుందన్నారు. మూగ జీవాలైన గొర్రెలు, మేకలు, ఆవులు సురక్షిత ప్రాంతంలో ఉంచుకోవాలన్నారు. రాత్రులు ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. పగలు కూడా అత్యవసరం అనుకుంటే బయట ప్రాంతాలకు గుంపుగా కలిసి వెళ్లాలన్నారు. అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను రెచ్చగొట్టేలా లోకేష్ వ్యాఖ్యలు


రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. యువగళం పాదయాత్రలో భాగంగా జరుగుతున్న బహిరంగ సభల్లో లోకేష్ మాటలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు నష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. అధికారులను భయపెట్టడం, టీడీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టడం పనిగా పెట్టుకున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై 2019 నుంచి 2024 వరకు ఎన్ని ఎక్కువ కేసులు ఉంటే అంత పెద్ద నామినేటెడ్ పదవి ఇస్తానని అనటం వెనుక లోకేష్ ఉద్దేశం ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవచ్చన్నారు. పలువురు మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులపై చేసిన తప్పుడు వ్యాఖ్యలకు లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదే విధంగా తన వద్ద ఎర్రబుక్ ఉందని ఇందులో అందరి పేర్లు రాసుకుంటున్నానని అధికారులను భయపెడుతున్నారని ఆరోపించారు. లోకేష్ ఇన్ని రోజుల పాదయాత్రలో రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం తాను గెలిస్తే ఏమి చేస్తారో? ఒక్కమాట కూడా చెప్పలేకపోవటం దురదృష్టకరమన్నారు. ఇన్ని రోజుల పాదయాత్రలో జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు ఏం నష్టం జరుగుతుందో కనీసం అడిగి తెలుసుకోలేకపోయారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో అన్ని వర్గాల కష్టాలను, అవసరాలను తెలుసుకుని అధికారంలోకి వస్తే ఏం చేస్తామన్నారో చెప్పి పాదయాత్రను కొనసాగించారని గుర్తుచేశారు. పుంగనూరు సంఘటనతో టీడీపీ అరాచకత్వం ప్రజలకు అర్థమైందన్నారు. తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయటం మానుకోవాలన్నారు.

ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు అభినందనల వెల్లువ


ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను అభినందిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ నాయకులు


ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పేరాడ తిలక్, నాయకులు

పోలాకి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి నియమింపబడిన మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మబగాంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ నాయకులు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ నాయకులు శనివారం వేర్వేరుగా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే చేనేత సంఘం నాయకుడు మంచు చంద్రయ్య, సరుబుజ్జిలి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు కేవీజీ సత్యనారాయణ, పాతపట్నం నియోజకవర్గానికి చెందిన నాయకులు ప్రదీప్, గేదెల సూర్యారావు, తూలుగు ప్రవీణ్, గుడారి అప్పన్న తదితరులు అభినందించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ఎమ్మెల్యే కృష్ణదాస్ పిలుపునిచ్చారు.

సంక్షిప్తంగా..

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

మెళియాపుట్టి: సామాజిక తనిఖీల ద్వారా ప్రజలకు ఉపాధి పనులపై అవగాహన కలుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లి యోగి అన్నారు. మండలంలోని గొప్పిలి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ గ్రామ సభలో పాల్గొన్నారు. పలు శాఖలలో 2022-23లో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఐటీడీఏ తదితర శాఖలలో జరిగిన పనులకు సంబంధించి ప్రస్తుత పరిస్థితి, ఖర్చుపెట్టినదానికి సరిపడా నాణ్యత ఉందా? లేదా? అనేదానిపై తనిఖీలు నిర్వహించడం ద్వారా ప్రజలకు సైతం లోటుపాట్లు తెలుస్తాయన్నారు. తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. డీఆర్పీ రమణ బాబు తనిఖీ చేపట్టి గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. తుది నివేదికను మండల స్థాయిలో జరగనున్న ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ పల్లి జయసుధ, ఎంపీటీసీ సభ్యురాలు కొల్లాన ఇందిరాదేవి, టీఏ గౌరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బూర్జ: తనపై దాడికి పాల్పడడంతో పాటు కులం పేరుతో దూషించాడని గుత్తావల్లికి చెందిన గ్రీన్‌అంబాసిడర్ యలగాడ జగన్నాథం అదే గ్రామానికి చెందిన సనలప సురేష్‌కుమార్‌పై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా గ్రామంలోని సురేష్‌కుమార్ ఇంటి వద్దకు వెళ్లి, చెత్త వేయాలని అడిగానని, ఆ సమయంలో ఇంటిపైనున్న సురేష్‌కుమార్ వచ్చి, తనపై దాడిచేసి గాయపర్చాడని, అలాగే తనను కులంపేరిట దూషించాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను గాయపడిన విషయాన్ని బంధువులకు తెలియడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో తనను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సురేష్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

కొత్తూరు: చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కొత్తూరు కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు అన్నారు. ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కొత్తూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు శనివారం కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ కోసం తెలుసుకుని, ఎవరైనా బ్యాడ్‌గా టచ్ చేస్తే వెంటనే ప్రతిఘటించాలన్నారు. మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ మీకంటే తెలివైన విద్యార్థులతో పోటీపడి వారికంటే బాగా చదివేందుకు ప్రయత్నించాలన్నారు. బాల్యవివాహాలను వ్యతిరేకించాలన్నారు. ఎస్‌ఐ ఎం గోవింద్, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, హెచ్‌ఎం ఎ.గోవిందరావు, న్యాయవాదులు ధర్మారావు, రాడ రాజు, ప్రసాద్, రవికిరణ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

లంపీస్కిన్‌పై అప్రమత్తం

ఆమదాలవలస: పశువులకు సంక్రమించే లంపీస్కిన్ వ్యాధిపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ ఆర్.ఆనందరావు సూచించారు. శనివారం పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందించే లంపీ స్కిన్ వ్యాధి నిరోధక ముందస్తు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పాడిరైతులకు పలు సూచనలు అందించారు. వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధల కోసం వివరించారు. పశువైద్య శాఖ సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా సేవలు చిరస్మరణీయం


పాతపట్నం: కొరసవాడలో మదర్ థెరీసా విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: మదర్ థెరీసా ఓ వ్యక్తి కాదని మహాశక్తి అని కొరసవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బిసిరింగి సింహాచలం అన్నారు. మండలంలోని కొరసవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మదర్ థెరీసా జయంతిని శనివారం నిర్వహించారు. మదర్ థెరీసా విగ్రహానికి నివాళులర్పించారు. ఆమె జీవిత చరిత్రపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఆమె జీవిత చరిత్ర పుస్తకాలు బహుమతిగా అందజేశారు. ఉపాధ్యాయులు, రామరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పారశెల్లి రామరాజు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మదర్ థెరీసా సేవలు చిరస్మరణీయం అరుణోదయ ఆదరణ నిలయం డైరెక్టర్ జి.అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గాజులకొల్లివలసలో అరుణోదయ ఆదరణ నిలయం ఆవరణలో గల మదర్ థెరిసా విగ్రహానికి న్యూ ఢిల్లీ ఆదిలీలా ఫౌండేషన్, నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జయంతి వేడుకలు నిర్వహించారు. నిరుపేదలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. క్రిస్టియన్ రైట్స్ ఫోరం జిల్లా కార్యదర్శి డాక్టర్ పైడి ముజస్ రాజు, ఆమదాలవలస నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ జార్జ్ ముల్లర్ తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: మదర్ థెరీసా సమాజ సేవకురాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.కేశవరావు అన్నారు. పాఠశాలలో మదర్ థెరీసా జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.